సిరిమాను భద్రమేనా?

- ఏళ్ల తరబడి హుకుంపేట రాజగోపాల్ లాండ్రీకి తరలింపు
- ఏళ్ల తరబడి అక్కడే పడేస్తున్న వైనం
- ఎండా,వానకు పూర్తిగా పాడై మట్టిలో కలిసిపోతున్న సిరిమాను
- సిరిమానులకు మ్యూజియం ఏర్పాటు చేయాలని భక్తుల డిమాండ్



సిరిమానును చదురుగుడి నుంచి హుకుంపేట రాజగోపాల్ లాండ్రీకి తరలిస్తున్న పైడితల్లి దీక్షధారులు

విజయనగరం టౌన్: ఏటా లక్షలాది మంది భక్తులు దర్శించుకునే సిరిమానును ఉత్సవం పూర్తయిన తర్వాత మూడురోజుల పాటు చదురుగుడి ఆలయం వద్దనే భక్తుల దర్శనంకోసం ఉంచుతారు. అనంతరం శనివారం వేకువజామున అమ్మవారి దీక్షాపరులు, పూజారితో కలిసి హుకుంపేటలోని రాజగోపాల్ లాండ్రీకి తరలిస్తారు. అక్కడ ఎండ, వానకు తడిచి ఆ ప్రదేశంలో పెట్టిన సిరిమానులన్నీ పూర్తిగా పాడైపోతాయి. కొన్నాళ్లకు అవి మట్టిలో కలిసిపోతాయి. వందల సంవత్సరాలు చరిత్ర కలిగిన సిరిమానులను భద్రపరిచి భావితరాలకు చూపించాలన్న అంశంపై కనీసం ఎవరూ దృష్టిసారించకపోవడంపై భక్తులు విచారం వ్యక్తంచేస్తున్నారు. ఏ యేటికాయేడు సిరిమాను, ఇరుసుమానుల కోసం చింతమానును గుర్తించి, పూజలు చేసి, హుకుంపేటకు తీసుకువచ్చి, సిరిమానుగా మలచి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి సిరిమాను చెక్కేటప్పుడు వచ్చే చెక్కలను సైతం భక్తులు కొనుగోలు చేస్తారు. వాటిని తమ ఇళ్లలోని బీరువాల్లో దాచిపెట్టుకుని లక్ష్మీకటాక్షం సిద్ధిస్తుందని నమ్ముతారు. అంతటి ప్రాధాన్యం ఉన్న సిరిమానులు మట్టిలో కలిసిపోతుండడంపై భక్తులు ఆవేదన చెందుతున్నారు.

సంరక్షణ లేక...

ఉత్సవం నిర్వహించడం, పూర్తయిన తర్వాత సిరిమానును తీసుకువచ్చి రాజగోపాల్ లాండ్రీలో పెట్టేయడం చేస్తున్నారు. ఎటువంటి సంరక్షణ లేకపోవడంతో అవిపూర్తిగా నిర్వీర్యమైపోతున్నాయి. సిరిమానులను ఉంచే ప్రదేశం కూడా అపరిశుభ్ర వాతావరణంలోనే ఉండడం విచారకరం. సిరిమానుల సంరక్షణతో పాటు పైడితల్లి అమ్మవారి ప్రతిరూపంగా పేరొందిన పతివాడ అప్పలనాయుడు నుంచి నేటి బంటుపల్లి వెంకటరావు వరకు చారిత్రక నేపథ్యాన్ని భావితరాలకు తెలిసేలా ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని పలువురు భక్తులు పేర్కొంటున్నారు. సిరిమానులను భద్రపరిచి వాటిని మ్యూజియంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

వసూళ్ల పండగ..!



ఉత్సవాల పేరుతో అధికారుల దందా వివరాలు వెల్లడిస్తున్న పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి

విజయనగరం గంటస్తంభం: ప్రతిష్ఠాత్మక విజయనగరం ఉత్సవాలు అధికారులకు వసూళ్ల ఉత్సవంగా మారాయని పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి విమర్శించారు. సంస్థ కార్యాలయంలో విలేకరులతో ఆయన శనివారం మాట్లాడారు. ఉత్సవం పేరుతో మార్కెట్‌లో వ్యాపారులందరి నుంచి ముక్కుపిండి డొనేషన్లు వసూలు చేశారని విమర్శించారు. కలెక్టర్ కొత్తవారు కావడంతో ఓ రెవెన్యూ అధికారి అన్నీతానై వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపించారు. వ్యాపారుల నుంచి ముక్కుపిండి వసూలు చేసిన తరువాత వారు తప్పుచేస్తే ప్రశ్నించేందుకు అధికారులకు ఏం నైతిక హక్కు ఉంటుందని ప్రశ్నించారు. పాస్‌లు ఎవరికి ఇచ్చారో.. ఎన్ని ఇచ్చారో తెలియదని, సిరిమాను తిరిగేటప్పుడు లోపల బనియన్లతో దూరిన వారు ఎవరో చెప్పాలన్నారు. సామాన్యులను కోటలోకి రానివ్వకపోవడం విచాకరమన్నారు. డొనేషన్ల పేరుతో వచ్చిన మొత్తాల వివరాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ప్రజలకు వెల్లడించాలని, అఖిలపక్ష సమావేశం నిర్వహించి చర్చించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పౌర వేదిక ప్రతినిధులు మమ్ముల తిరుపతిరావు, గోపాలరావు, శివప్రసాద్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



మయసభలో దుర్యోధనుడిగా బూర్లె శరణ్య ప్రదర్శన



వనంగుడి వద్ద తమ్మిన సాహితీప్రియ భరతనాట్య ప్రదర్శన

విజయనగరం టౌన్: సిరులతల్లి పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతర మహోత్సవాల్లో భాగంగా వనంగుడి, చదురుగుడి ఆవరణలలో నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంటున్నాయి. చదురుగుడి ఆవరణలో శనివారం మయసభలో దుర్యోధనుడిగా బూర్లె శరణ్య అద్భుతమైన ప్రదర్శన చేసి ఆహూతుల కరతాళ ధ్వనులందుకుంది. కె.విజయలక్ష్మి వయోలిన్ కచేరీ, ఐ.మెహర్‌లత భక్తిసంగీతం ఆకట్టుకున్నాయి. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి ఆవరణలో తమ్మిన సాహితీప్రియ, టి.ఉషారాణిల భరతనాట్యప్రదర్శన ఆద్యంతం రక్తికట్టించింది. కాకినాడ నుంచి టి.పవన్ కుమార్ తోలుబొమ్మలాట అలరించింది. అనంతరం కళాకారులను ఆలయ అధికారులు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.

జిజ్ఞాసను పెంపొందించేందుకు 'చెకుముకి సైన్స్ పరీక్ష'



పోస్టర్ విడుదల చేస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు

- డీఈఓ యు.మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు, జిజ్ఞాసను ప్రోత్సహించేందుకు జనవిజ్ఞాన వేదిక నిర్వహించే 'చెకుముకి సైన్స్ సమ్మేళనాలు' దోహదపడతాయని డీఈఓ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. పోటీలకు సంబంధించిన షెడ్యూల్ వివరాల పోస్టర్‌ను శనివారం ఆయన చాంబర్‌లో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులతో కలిసి విడుదలచేశారు. తొలుత అక్టోబర్ 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల/పట్టణ స్థాయి, నవంబర్ 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12, 13, 14వ తేదీల్లో రాష్ట్రస్థాయిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వస్తామన్నారు. పరీక్షకు హాజరయ్యేందుకు రూ.10 రుసుం చెల్లించాలన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలకు బహుమతుల ప్రదానంతో పాటు శాస్త్రవేత్తలతో ముఖాముఖి, విజ్ఞాన విహార యాత్రకు అవకాశం కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు డాక్టర్ ఎంవీఎస్ వెంకటరావు, చీకటి దివాకర్, కె.మురళీబాబు, కె.శశిధర్, ఆదినారాయణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు కారణంగా డెంకాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. డెంకాడ, గుణుపూరు గ్రామాలతో పాటు మండల కార్యాలయాలు, డంపింగ్ యార్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని వివరించారు.

వైద్యవిద్యా వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి



రౌండ్ టేబుల్ సమావేశం వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన రెడ్డి శంకరరావు, సభ్యులు

- ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే చెల్లించాలి
- పౌరవేదిక సంఘం డిమాండ్

విజయనగరం గంటస్తంభం: పేదలకు అందుబాటులో వైద్యవిద్య అందాలంటే వైద్యవిద్య, ప్రజారోగ్య వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎల్బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్యరంగాన్ని పీపీపీ మోడల్‌లో ప్రైవేట్ చేతుల్లోకి అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇది ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నమన్నారు. గత ప్రభుత్వం కేంద్ర నిధులతో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయగా, అందులో ఐదు ఇప్పటికే ప్రారంభమైనట్లు గుర్తుచేశారు. ఇప్పుడు ఆ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలనుకోవడం పేద విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ చేతుల్లోకి వెళ్తే వైద్య విద్య పేదలకు అందని ద్రాక్ష అవుతుంది. ఫీజులు భారీగా పెరిగి పేద విద్యార్థులు వెనుకబడిపోతారు. అదేవిధంగా వైద్యం కూడా మరింత ఖరీదుగా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

పీహెచ్‌సీ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల పేదలు చికిత్స అందక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వెంటనే ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీ వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోసం 20 రోజులుగా సమ్మెలో ఉన్నారని, వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రజారోగ్య వ్యవస్థ నిర్వీర్యమవుతోందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని కోరారు. ఈనెల 15తేదీన విజయనగరంలో జరగనున్న రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో యూఎస్.రవికుమార్, సుధీర్, సతీష్ పాల్గొన్నారు.

పశుబీమాపై నీలినీడలు!



పూసపాటిరేగలో పశువులు

- జూలై నుంచి అమలుకాని పశుబీమా
- ప్రమాదవశాత్తూ పశువులు మరణిస్తే పైసా కూడా అందని వైనం
- ఆందోళనలో పాడి రైతులు

పూసపాటిరేగ: పాడి పశువులు ఆపదలో పడినప్పుడు రైతుకు అండగా నిలిచే పశుబీమాపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత నాలుగు నెలలుగా పశుబీమా పథకం అందక పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యాధులబారిన పడి పశువులు మృత్యువాత పడుతున్నా బీమా అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పశుబీమా పథకం పక్కాగా అమలయ్యేది. పాడిపశువు మృతి చెందితే రూ.15వేల నుంచి రూ.40వేల వరకు బీమా అందేది. నేడు ఓ వైపు పాలధర తగ్గడం, మరోవైపు పాడి పశువులు మృతిచెందితే బీమా అందకపోవడం వంటివి పాడిరైతును కుంగదీస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి పశుబీమా పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పాడిరైతులు కోరుతున్నారు.

బీమా పునరుద్ధరించాలి

పాడి రైతులకు తక్షణమే పశుబీమా పునరుద్ధరించాలి. గతంలో పాడిరైతులకు ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించి ఆదుకొనేది. పశువులు వ్యాధులు బారిన పడి మృత్యువాత పడితే బీమా డబ్బులు అందేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి పశుబీమాను పునరుద్ధరించాలి.

– ఎం.రామునాయుడు, రైతు, పతివాడ

బురద నీటిని తాగేదెలా..?

- రామన్నపేటలో కలుషితమవుతున్న తాగు నీరు
- వర్షా కాలంలో పైపుల ద్వారా బురద నీరు సరఫరా అవుతున్న వైనం
- పైపులైన్లకు లీకులతో పాటు కుళాయి పాయింట్లు గోతుల్లో ఉండడమే కారణం
- అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తుల ఆరోపణ



రామన్నపేట గ్రామం



రామన్నపేటలో కుళాయిల ద్వారా వస్తున్న బురద నీరు

గజపతినగరం:

ఓ మోస్తారు వర్షం కురిస్తే చాలు మండలంలోని రామన్నపేట గ్రామస్తులు తాగునీటికి అవస్థలు పడాల్సిందే. గ్రామంలో 40 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం, కుళాయిలు ఉన్నప్పటికీ గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో బురదనీరే దిక్కు అవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో సుమారు 300 కుటుంబాలు, 1,450 మంది జనాభా ఉన్నారు. వీరంతా తాగునీటికి స్థానికంగా ఉన్న రక్షిత మంచినీటి పథకంపైనే ఆధారపడుతుంటారు. వాటర్ ట్యాంకు నుంచి కుళాయిలకు వేసిన పైపులైన్లకు కాలం చెల్లడంతో కొన్ని చోట్ల లీకులు ఏర్పడ్డాయి. సుమారు 200 కుళాయి పాయింట్లు ఉండ గా, వీటిలో జలజీవన్ మిషన్ పథకం కింద 137 ఏర్పాటు చేశారు. జల జీవన్ మిషన్ పథకం పనులు చేసినప్పుడు పాత పైపులైన్లను మార్చకుండా కుళాయిలు వేసేశా రని గ్రామస్తులు చెబుతున్నారు. కుళాయి పాయింట్లు చాలా వరకు గోతుల్లో ఉండడం, పైపులైన్లకు లీకులు ఉండడం వల్ల వర్షాలు కురిసేట ప్పుడు వరద నీరు పైపుల్లోకి చేరుతోంది. అలాగే రక్షిత మంచినీటి పథకం వద్ద తాగునీటి సరఫరా నిలిపివేసిన సమయంలో గోతుల్లో కుళాయి పాయింట్ల నుంచి బురదనీరు వెనక్కి లాగుతుండడం తాగునీటి కలుషితానికి ప్రధానం కారణం. వర్షాకాలంలో కుళాయిల ద్వారా రోజూ సుమారు 20 నిముషాలు పాటు బురద నీరు వస్తుందని, ఆ తర్వాత మంచి నీరు వస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు.

రోగాల బారిన పడుతున్నాం..

కలుషిత నీటి వల్ల రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపైపులైన్లు వేయడంతో పాటు కుళాయిల వద్ద ప్లాట్‌ఫారాలు నిర్మించి, ట్యాపులు ఏర్పాటు చేయడమే ఈ సమస్యకు పరిష్కారమని, ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి సువ్వాడ మణి వద్ద సాక్షి ప్రస్తావించగా ఆమె స్పందిస్తూ రామన్నపేటలో 40వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు ఉందని, కొత్తగా మరో 35వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు మంజూరైందని చెప్పారు. పనులను కాంట్రాక్టర్లకు అప్పగించాక కొత్త ట్యాంకు నిర్మాణంతో పాటు కొత్త పైపులైన్‌లు వేయిస్తామని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గ్రామంలోని ఓ వీధిలో ట్యాప్ లేని కుళాయి పైపు



గోతిలో మురుగునీటి మధ్య ఉన్న కుళాయి



ఓ వీధిలో మురుగునీటి కాలువను ఆనుకుని ఉన్న కుళాయి

ఐదు పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ



బొడ్డవర చెక్‌పోస్టును తనిఖీచేస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని గంట్యాడ, బొడ్డవర చెక్‌పోస్టు, ఎస్.కోట, వల్లంపూడి, ఎల్.కోట పోలీస్‌స్టేషన్లను ఎస్పీ దామోదర్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పలు కేసుల్లో సీజ్‌చేసి స్టేషన్ ప్రాంగణంలో ఉన్న వాహనాలను నూతన చట్టాల నిబంధనల మేరకు త్వరితగతిన డిస్పోజ్ చేయాలని ఎస్‌హెచ్‌వోలను ఆదేశించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లలో పనిచేసే సిబ్బందితో కాసేపు ముచ్చటించారు. ఫిర్యాదు అందిన వెంటనే సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించాలని, పీజీఆర్ఎస్ వరకు రానీవద్దని ఆదేశించారు. స్మార్ట్ పోలీసింగ్‌తో ప్రజలకు మెరుగైన సేవలందించాలని, అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. బొడ్డవర చెక్‌పోస్టు వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, ఒడిశా నుంచి గంజాయి అక్రమ రవాణా జరగకుండా అడ్డుకట్ట వేయాలని కోరారు. ఆయన వెంట ఎస్.కోట సీఐ వీఎస్ మూర్తి, రూరల్ సీఐ అప్పలనాయుడు, విజయనగరం సీఐ లక్ష్మణరావు, ఎస్ఐలు సాయికృష్ణ, చంద్రశేఖర్, సుదర్శనరావు, నవీన్ పడాల్‌తో పాటు ఎస్‌బీ ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.

క్లుప్తంగా

బడ్డుకొండను కలిసిన దవళ



మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును సత్కరిస్తున్న దవళ లక్ష్మణరావు

డెంకాడ: వైఎస్సార్‌సీపీ కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన దవళ లక్ష్మణరావు నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువతో సత్కరించి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున కార్మికుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని దవళ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నెల్లిమర్ల మండలాధ్యక్షుడు గదల సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ముమ్మర తనిఖీలు



మద్యం దుకాణంలో నమూనాలను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

విజయనగరం రూరల్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు విజయనగరం ఎక్సైజ్ స్టేషన్–1 పరిధిలో ఉన్న మద్యం దుకాణాలు, బార్లలో శనివారం తనిఖీలు చేశారు. సీఐ మన్మథకుమార్ ఆధ్వర్యంలో మద్యం నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. నమూనాలు పరీక్షించి వాటిని రసాయన విశ్లేషణ నిమిత్తం విశాఖపట్నంలో ఉన్న ఎక్సైజ్ లేబొరేటరీకి పంపిస్తామని తెలిపారు.

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్



సర్వజన ఆస్పత్రిలో పాడైన ఆర్వో వాటర్ ప్లాంట్

విజయనగరంఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆర్వో వాటర్ ప్లాంట్ కొద్ది రోజులుగా పనిచేయడం లేదు. ఆస్పత్రికి వచ్చేవారికి స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. ఈ విషయం తెలిసినా ఆర్వోప్లాంట్ బాగుచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంలేదంటూ రోగులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు. వందలాదిమందికి సురక్షిత తాగునీరు అందించే వాటర్ ప్లాంట్‌పై నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా ఆర్వో ప్లాంట్ పాడైన విషయం తన దృష్టికి రాలేదని, బాగుచేయిస్తామని తెలిపారు.

మద్యం నాణ్యతపై తనిఖీ



నెల్లిమర్లలో మద్యం షాపులో తనిఖీలు చేస్తున్న సీఐ వెంకటరావు

నెల్లిమర్ల: మద్యం నాణ్యత లోపిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 14405కి ఫిర్యాదు చేయాలని నెల్లిమర్ల ఎక్సైజ్ సీఐ వెంకటరావు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గత వారంరోజులుగా ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టామని తెలిపారు. నెల్లిమర్ల, గుర్ల మండలాల్లోని మొత్తం 11 దుకాణాల్లోని మద్యం నాణ్యతను తనిఖీ చేసినట్లు చెప్పారు. నెల్లిమర్ల గోదాము నుంచి కొనుగోలు చేసిన మద్యం మాత్రమే అన్ని దుకాణాల్లో ఉన్నట్లు తెలిపారు. ఇకపై ప్రతి నెలా తనిఖీలు చేపడతామని పేర్కొన్నారు.

రైలు ప్రయాణికులకు పూర్తిసాకర్యాలు

- రైల్వే అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ శాంతారామ్



రైలు ప్రయాణికులకు బహుమతులు అందజేస్తున్న శాంతారామ్

విజయనగరం టౌన్: రైలు ప్రయాణికులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అసిస్టెంట్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఇ.శాంతారామ్ అన్నారు. విజయనగరం రైల్వేస్టేషన్‌లో శనివారం ప్రయాణికులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమృత్ సంవాద్‌లో భాగంగా ప్రయాణికులు, వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించి ఆహారం నాణ్యత, వెయిటింగ్ హాల్స్, టాయిలెట్స్ సౌకర్యాలు తదితర వాటిపై అభిప్రాయాలను తెలుసుకోగలిగామన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం కె.పవన్ కుమార్, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ సాయిరాజ్, తదితరులు పాల్గొన్నారు.